క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



స్పీడ్ బ్రేకర్లు వేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సూర్యాపేటటౌన్ : రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జమ్మిగడ్డ సమీపంలోని జంక్షన్, చర్చి కాంపౌండ్, పూల సెంటర్ నల్లాల బావి, వాణిజ్య భవన్, కుడకుడ తదితర ప్రాంతాల్లో గురువారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. జిల్లా కేంద్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి గుర్తింపు

నూతనకల్ : విద్యార్థుల ప్రగతిలో అల్లునూరు ప్రాథమిక పాఠశాల రాష్ట్రస్థాయి ఉత్తమ పాఠశాలగా ఎంపికై నట్లు మండల విద్యాధికారి రాములునాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బెస్ట్ ప్రాక్టీస్ స్కూల్‌గా పాఠశాల రాష్ట్రస్థాయిలోనే రెండో స్థానం పొందడం హర్షణీయమన్నారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందే విధంగా కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య, నాగేశ్వర్‌రావు, లింగాల శ్రీనివాస్, రేణుక పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నూతనకల్ : ఉపాధిహామీ పనులపై శుక్రవారం నిర్వహించే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ సునీత కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించడంతోపాటు పనిదినాలను కల్పించడం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో డీజేలు నిషిద్ధం



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సైదులు

అర్వపల్లి : గణేష్ నవరాత్రి ఉత్సవాలలో డీజేలు ఉపయోగిస్తే వాటి యజమానులతో పాటు మండపాల నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సైదులు హెచ్చరించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో డీజే యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గణేష్ ఉత్సవాలలో డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ముందుగా యజమానులను తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ ఎదుట బైండోవర్ చేశారు.

చీదెళ్లలో వైద్యశిబిరం

పెన్‌పహాడ్: చీదెళ్ల గ్రామంలో రెండు డెంగీ కేసులు నమోదు కావడంతో గురువారం గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరాజు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైద్యశిబిరం ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. జ్వర పీడితులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వెంకన్న, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, ఏఎన్ఎం మాధవి, హెల్త్ అసిస్టెంట్‌లు ప్రేమ్‌కుమార్, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నూతనకల్ : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సందీప్ కోరారు. గురువారం గుండ్లసింగారం కేజీబీవీలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 16మంది బాలికలు జ్వరంతో బాధపడుతున్నారని గుర్తించి మందులు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలోని మురుగు గుంతల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్‌బాల్స్ వదిలారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శరణ్‌నాయక్, పాఠశాల ప్రత్యేక అధికారి మాధవి, పుష్ప, సీతారాంరెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మురుగుగుంతల్లో ఆయిల్‌బాల్స్ వదులుతున్న వైద్యసిబ్బంది

ఫాగింగ్ జాడలేక.. పరేషాన్

- గ్రామాల్లో మూలనపడిన ఫాగింగ్ యంత్రాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెన్‌పహాడ్ : వర్షాకాలం ప్రారంభంతోనే గ్రామాల్లో దోమల బెడద విపరీతంగా పెరిగింది. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, ఫాగింగ్ యంత్రాలు పనిచేయకపోవడంతో గ్రామీణులు దోమకాటుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు ఇప్పుడు గ్రామ పంచాయతీల్లో మూలన పడి ఉన్నాయి. ఫలితంగా గ్రామాల్లో ప్రజలు దోమల స్వైర విహారంతో విలవిలలాడుతున్నారు.

పనిచేయని యంత్రాలు..

గ్రామాల్లో దోమల నివారణ కోసం గతంలో ఒక్కో ఫాగింగ్ యంత్రానికి రూ.35వేల నుంచి రూ.40వేలు ఖర్చు చేసి కొనుగోలు చేశారు. కానీ వీటిని సక్రమంగా నిర్వహించకపోవడం, డీజిల్, పెట్రోల్, లిక్విడ్‌లను సరైన పద్ధతిలో వాడకపోవడంతో చాలా యంత్రాలు పాడైపోయాయి. ప్రస్తుతం మండలంలోని అనంతారం, అనాజీపురం, చినగారకుంట తండా వంటి కొన్ని గ్రామాల్లో మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారు. కానీ అన్నారం బ్రిడ్జి, అన్నారం, గాజులమల్కాపురం, చెట్లముకుందాపురం, ధర్మాపురం వంటి ముఖ్యమైన గ్రామాల్లో ఫాగింగ్ మిషన్లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి.



చెట్లముకుందాపురంలో వాటర్ ట్యాంక్ వద్ద నిలిచిన మురుగు నీరు

నిధుల లేమితో నిలిచిన మరమ్మతులు..

'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా అధికారులు ఫాగింగ్ యంత్రాలను మరమ్మతులు చేయించాలని సూచనలు చేస్తున్నప్పటికీ, గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఆ పని ముందుకు సాగడం లేదు. పాడైపోయిన యంత్రాలకు మరమ్మతులు చేయించాలంటే చాలా ఖర్చు అవుతోందని, ఇది తమకు భారంగా మారిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమల నివారణ చర్యలు పూర్తిగా నిలిచిపోయాయి.

దోమల స్వైరవిహారం..

వాస్తవానికి ప్రతి గ్రామంలో వారంలో రెండుసార్లు ఫాగింగ్ చేపట్టాలి. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభంలో వీటిని ఎక్కువగా వాడితే దోమలను గణనీయంగా నియంత్రించవచ్చు. కానీ, ప్రస్తుతం చాలా గ్రామాల్లో కనీసం నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. దీంతో దోమలు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. ఫలితంగా డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఫాగింగ్ యంత్రాలను బాగు చేయించాలని, దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదేశాలు జారీ చేశాం

ప్రతి గ్రామంలో దోమల నివారణకు మందును పిచికారీ చేయాలని కార్యదర్శులకు సూచించాం. కొన్ని గ్రామాల్లో ఫాగింగ్ మిషన్లు పాడైపోయినట్లు తెలిసింది. వాటిని మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. వ్యాధులు ప్రబలకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉంటాం

– జానయ్య, ఎంపీడీఓ

అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు



చివ్వెంల : మోదిన్‌పురంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్వోత్తమ్ రెడ్డి, వేణారెడ్డి

చివ్వెంల : నియోజకవర్గంలో దశలవారీగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బి.చందుపట్ల, అక్కలదేవిగూడెం, మోదిన్‌పురం గ్రామాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా బి.చందుపట్ల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేములపల్లి వాసుదేవరావు, చింతమళ్ల రమేష్, ఎండీ అంజాద్ అలీ, ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, ఓబీసీ రావుల రాంబాబు, వెన్న మధుకర్ రెడ్డి, పందిరి మల్లేష్ గౌడ్, నంద్యాల సోమిరెడ్డి, మండవ కోటేష్, రాము, గురువయ్య, రామకృష్ణ, అంజయ్య పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

సూర్యాపేట : పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో సొంత ఇంటి కల నెరవేరుతోందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్త అన్నారు. గురువారం సూర్యాపేట మండలం టేకుమట్లలో 81 మందికి ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. అలాగే 30 మంది ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సహకారంతో 81 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్తు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రజాపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింత అలివేలు కేశాలు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దాసరి నరసయ్య, మాజీ వార్డు సభ్యులు దాసరి శ్రీనివాస్, పోకల వరుణ్, దుర్గ విజయ్, నాయకులు కాంపాటి రమేష్, వీరమల్ల అంజయ్య, జాల మాణిక్యం, బొడ్డు సైదులు, సూరారపు రమేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు అందిస్తున్న గట్టు శ్రీనివాస్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



సూర్యాపేట అర్బన్ : ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు



నాగారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

సూర్యాపేట అర్బన్ : గ్రామ పంచాయతీలకు అత్యవసర నిధులు మంజూరు చేయాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. స్థానిక సంస్థలకు తక్షణమే నిధులు కేటాయించి, పారిశుద్ధ్య పనులను చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం సూర్యాపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడం వల్ల మురుగు కాలువలు శుభ్రం చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనివల్ల గ్రామాలలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని, వర్షం వస్తే వీధులు బురదమయంగా మారుతున్నాయని తెలిపారు. పారిశుద్ధ్యం లోపించడం వల్ల దోమలు, ఈగలు పెరిగి ప్రజలు డెంగీ, మలేరియా వంటి జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేసి ప్రజలను అనారోగ్యం నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్ కుమార్, గులాం హుస్సేన్, గోగుల వీరబాబు, ఉత్తరాది మోహన్, జానయ్య, చంద్రకళ, జయమ్మ, బయ్యా గణేష్ పాల్గొన్నారు.

నాగారం : గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం అత్యవసర నిధులు కేటాయించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వేర్పుల లక్ష్మయ్య, డివిజన్ నాయకులు మామిడి సుధాకర్, రాయల రాజ్‌కుమార్, శిరీష, వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

పలువురికి డాక్టరేట్

సూర్యాపేట : సూర్యాపేట జిల్లా పిన్నాయపాలెం గ్రామానికి చెందిన ఉప్పల జాను యాదవ్ ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఓయూ ఛాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, వీసీ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నాడు.

దర్శనం ప్రవళిక, డి.శివలీలకు..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న ఇద్దరు అధ్యాపకులు దర్శనం ప్రవళిక, డి.శివలీల ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకున్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నాగ ప్రసన్న కుమారికి..

సూర్యాపేట పట్టణానికి చెందిన కల్తి నాగ ప్రసన్న కుమారి ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, యూనివర్సిటీ వీసీ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. నాగ ప్రసన్న డిగ్రీ వరకు భద్రాచలంలో చదివి ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేసింది. పీహెచ్‌డీ కూడా యూనివర్సిటీలోనే పూర్తి చేసి డాక్టరేట్ అందుకుంది. డాక్టరేట్ అందుకోవడం పట్ల ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న మహిళా సంఘం సభ్యులు

సూర్యాపేట అర్బన్ : లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ కోటి రత్నంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడారు. సూర్యాపేట జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్లలను కడుపులోనే చంపేస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు సైతం ఇలాంటి పరీక్షలు చేసి అబార్షన్లు చేస్తున్నారని, దీనివల్ల తల్లుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఆడపిల్లలు లేని సమాజం ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజలకు లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించాలని కోరారు. రిజిస్ట్రేషన్ లేకుండా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలపై, అర్హతకు మించి వైద్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తూ, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ, కోశాధికారి జయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు ఐతరాజు పద్మ, బొజ్జ ఎల్లమ్మ, అనసూర్య, బాజీ, రజిత, పద్మ, ఫర్వీన్, లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతాం



మద్దిరాలలో మాట్లాడుతున్న కోట గోపి

మద్దిరాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 24న ప్రజా సమస్యలపై పోరుబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. గత సంవత్సర కాలం నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు తీవ్రరూపం దాల్చాయని అన్నారు. గత పదేళ్లుగా వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, వికలాంగులకు నూతన పెన్షన్లు ఇవ్వకుండా ప్రభుత్వ జాప్యం చేస్తోందని అన్నారు. నూతన రేషన్‌కార్డులు ఇచ్చినట్లుగానే నూతన పెన్షన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. రైతులు యూరియా కొరతతో చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కల్లెపల్లి భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, మండల కార్యదర్శి పోలోజు సైదులు, ఉపేందర్, మద్దెల కోటయ్య, పాతూరి మల్లారెడ్డి, కొంపెల్లి నాగయ్య, మోష, మీనయ్య, ఎల్లయ్య, మల్సూర్, దేవయ్య పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు విక్రయించాలి



గండూరి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : నాణ్యమైన వస్త్రాలు విక్రయించి వినియోగదారుల మన్ననలు పొందుతూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గండూరి కృపాకర్ నూతనంగా ఏర్పాటు చేసిన గండూరి షాపింగ్ మాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు, పురుషులు మెచ్చేలా సరికొత్త మోడల్స్‌ను పరిచయం చేస్తూ 30 సంవత్సరాల విశేష అనుభవంతో గండూరి షాపింగ్ మాల్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. అందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన వస్త్రాలను విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గండూరి పావని, మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, సవరాల సత్యనారాయణ, గండూరి శంకర్‌తోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సిద్ధార్థ

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను మేస్త్రీలు, సిమెంట్, ఐరన్ వ్యాపారులు ఇబ్బందులకు గురి చేయవద్దని గృహనిర్మాణ శాఖ పీడీ సిద్ధార్థ కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మేస్త్రీలు, సిమెంట్, ఐరన్, సెంట్రింగ్ వ్యాపారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరలకు సిమెంట్, ఐరన్ విక్రయించాలని ఆయన సూచించారు. నాణ్యమైన సామగ్రిని అందిస్తూ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు సహకరించాలన్నారు. అలాగే మేస్త్రీలు కూడా ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేయకుండా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, డిప్యూటీ ఈఈ జబ్బార్ అహ్మద్, ఏఈ పూజ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, వ్యాపారులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



వృద్ధులను సన్మానిస్తున్న సంఘం సభ్యులు



వృద్ధులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

భానుపురి : జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వయోవృద్ధులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, కోశాధికారి అమీద్ ఖాన్, మండల సెక్రటరీ సుధగాని నాగేశ్వరరావు, ట్రెజరర్ జి.సోమయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేందర్ రెడ్డి, వీరయ్య, యాదగిరి, పిచ్చిరెడ్డి, లింగయ్య, రామారావు, కృష్ణ, విద్యాసాగర్, అంజయ్య, వెంకన్న, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : సమాజంలో వృద్ధులను గౌరవించడం మనందరి బాధ్యత అని తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తల్లాడ కేదారి అన్నారు. గురువారం జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో వృద్ధులను సన్మానించి మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులు ఓరుగంటి సరోజినమ్మ, అంతయ్య, తల్లాడ నారాయణ, బండారి రాములును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి లయన్స్ క్లబ్ కోశాధికారి గుండగని రాము, కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, ఓరుగంటి సుభాష్, ఎనగందుల సంజీవ, ఎనగందుల గిరి, వేణు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు రహిత లావాదేవీలపై అవగాహన

నాగారం : నగదు రహిత లావాదేవీలపై రైతులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం వర్ధమానుకోట గ్రామంలో నల్లగొండ జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. నగదు రహిత లావాదేవీలు ఏ విధంగా చేసుకోవచ్చు, ఎన్ని రూపాలలో చేసుకోవచ్చు, దాని వల్ల లాభాలు తదితర అంశాలను వివరించారు. బ్యాంకుల సర్వీసులు, లోన్లు, లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి బ్రాంచ్ మేనేజర్ అలీమోద్దీన్, ఫీల్డ్ ఆఫీసర్ షరీఫ్, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఇన్‌చార్జ్ మహేందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుంట్ల సురేందర్‌రెడ్డి

కోట మైసమ్మకు కుంభాభిషేకం

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో ఉన్న శ్రీ కోట మైసమ్మ తల్లి దేవాలయంలో గురువారం కుంభం పోయుట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో అన్ని రకాల పండ్లు, ఫలహారాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజారులు, నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలువురు నాయకులు సన్మానించారు.

గోదావరి జలాలను విడుదల చేయాలి

అర్వపల్లి : ఎస్సారెస్పీ రెండో దశకు గోదావరి జలాలను తక్షణమే విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం అర్వపల్లిలో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వానాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఈ ప్రాంతానికి ఇంకా నీటిని విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండిపోయి లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారని, కానీ ఈ ప్రాంతానికి నీరు ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. కనీసం ఇప్పటికైనా నీటి విడుదలపై షెడ్యూల్ ప్రకటించకపోవడం సరికాదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 90 శాతం మంది రైతులు గోదావరి జలాలపై ఆధారపడి పంటలు పండిస్తున్నారని తెలిపారు. రైతులు తమ పొలాలను దున్నుకొని, పంటలు వేయడానికి గోదావరి నీటి కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి పంటకూ నీటిని విడుదల చేశామని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, కళ్లెట్లపల్లి శోభన్‌బాబు, బొడ్డు రామలింగయ్య, పందిరి యుగంధర్, మిర్యాల వెంకన్న, గోసుల విజయ్, కోటమర్తి మల్లయ్య, డాక్టర్ రామకోటి, కె.వెంకన్న, ఎల్లంరాజు, కట్టెల మల్లేష్, ఓర్సు వెంకన్న, బైరబోయిన సంతు, వేముల గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

ముగిసిన ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న చైర్మన్, నాయకులు

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు చైర్మన్‌ను, ఇతర నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందడి పూర్ణచంద్రారెడ్డి, కుక్కడపు సైదులు, కె.ఉదయ్, కె.శ్రీనివాసరెడ్డి, వీరారెడ్డి, వెంకటాద్రి, సూరారపు సైదులు, గంగదెరి శ్రీనివాస్, యల్లయ్య, పరమేష్, వెంకటేష్, రంజిత్, సాయిలు, మల్లయ్య, ఉపేందర్, ప్రభాకర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎరువుల కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు

తుంగతుర్తి : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దయానందం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించకూడదని ఉన్నారు. షాపు ముందు ఎరువుల ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆయా దుకాణాల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణ, ఎస్ఐ క్రాంతి కుమార్, ఎంఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

అర్వపల్లి : ప్రజానాట్యమండలి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కారుపోతుల అంజన్న వర్ధంతి సభను ఈ నెల 24న అర్వపల్లిలో నిర్వహించనున్నట్లు పూలే-అంబేద్కర్ ఆశయ పోరాట సమితి సభ్యులు తెలిపాది. గురువారం అర్వపల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు పలువురు ప్రముఖులు హాజరవుతారని, సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పూలే-అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య, జోగునూరి సుందర్‌రావు, వీరయ్య, మాజీ ఎంపీపీ జోగునూరి కరుణ, పద్మ, వెంకటయ్య, ఉప్పలమ్మ, మల్లేష్, నారాయణ, కాంతయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తుంగతుర్తి : మండలంలో వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాలకు పలు గ్రామాల్లో రహదారులు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని అన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోపగాని రమేష్, అఖిల్, గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

అర్వపల్లి : ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎం. విజయలక్ష్మి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డి. రమేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వారు సూచించారు. 95504 75444 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల తహసీల్దార్ హరిప్రసాద్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. ఈ అవార్డు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాన్ మహ్మద్, సర్వేయర్ జోసెఫ్, సుజిత్ రెడ్డి, జార్జ్ రెడ్డి, అనిత, మధు పాల్గొన్నారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది